రైతులకు అండగా..

- కోవూరులో డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ ఏర్పాటు
- విత్తనాలు, ఎరువుల నాణ్యతపై పరీక్షలు
- పంటల సాగులో అన్నదాతలకు తోడ్పాటు



కోవూరులో ఏర్పాటైన డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్

కోవూరు: అందరికీ అన్నం పెట్టే రైతన్నల అభ్యున్నతే ధ్యేయంగా వ్యవసాయానికి సంబంధించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను, సరికొత్త విధానాలను అమలు చేస్తున్నారు. నాసిరకం విత్తనాలు, ఎరువులతో నష్టపోతున్న రైతులు ఆ సమస్యలను అధిగమించేలా విత్తనాలు, ఎరువులను ముందుగానే పరీక్షించే విధంగా ప్రతి నియోజకవర్గంలో డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. అందుకు ఒక్కొక్క భవనానికి రూ.55 లక్షల చొప్పున నిధులు మంజూరు చేసి నిర్మాణం చేపట్టింది. అందులో భాగంగా కోవూరు నియోజకవర్గానికి సంబంధించి కోవూరు పట్టణంలో ఈ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ ల్యాబ్‌లో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువుల నాణ్యత, భూసారం తదితర పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందుకోసం లక్షలాది రూపాయల విలువ చేసే పరికరాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

విస్తారంగా పంటల సాగు

కోవూరు నియోజకవర్గంలో కోవూరు, బుచ్చిరెడ్డిపాళెం, విడవలూరు, కొడవలూరు, ఇందుకూరుపేట మండలాలు ఉన్నాయి. కాగా నియోజకవర్గంలోని రైతులు సుమారు 65,400 ఎకరాల్లో వరి, వేరుశనగ తదితర పంటలు సాగు చేస్తున్నారు. సాగునీటి సౌకర్యం సమృద్ధిగా ఉండడంతో 63,100 ఎకరాలు వరి పంట సాగు చేస్తుండగా, ఆరుతడి పంటగా 2000 ఎకరాల్లో వేరుశనగ, మరో 300 ఎకరాల్లో ఇతర పంటలు సాగు చేస్తున్నారు. అయితే కోవూరులో ఏర్పాటైన డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లో రైతుల అవసరాల మేరకు ఇప్పటివరకు 154 పరీక్షలు నిర్వహించారు. ఇందులో 112 విత్తన పరీక్షలు, 42 ఎరువుల పరీక్షలు నిర్వహించినట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. ఇటీవల కోవూరులోని అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టర్ మురళీకృష్ణ సైతం పరిశీలించి అక్కడ జరుగుతున్న పరీక్షల గురించి తెలుసుకున్నారు.

అధిక దిగుబడులు సాధించే అవకాశం

విత్తనాలు, ఎరువులను అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లో పరీక్షించుకొనే వెసులుబాటు ఉండడం వల్ల నాణ్యమైన విత్తనాలు, ఎరువులతో పంటలు సాగు చేసి అధిక దిగుబడులు సాధించే అవకాశం కలిగిందని రైతులు చెబుతున్నారు. తద్వారా నాసిరకం విత్తనాలు, ఎరువుల బెడద నుంచి రైతులకు ఉపశమనం కలిగింది. రైతులు పండించిన పంటల నుంచి సొంతంగా తయారు చేస్తున్న లేదా మార్కెట్‌లో కొనగోలు చేస్తున్న విత్తనాలను ఈ ల్యాబ్‌కు వెళ్లి ఉచితంగా పరీక్షించుకోవచ్చు. విత్తనాలతోపాటు ఎరువులు, పురుగు మందుల నాణ్యతను కూ డా పరీక్షించుకోవచ్చు. గ్రామాల్లోనే రైతులకు అవసరమైన అన్నిరకాల సేవలను అందిస్తున్న రైతుభరోసా కే ంద్రాలను డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌కు అనుసంధానం చేశారు. ఈ పరీక్షలను ప్రత్యేక నిపుణులు చేపడతారు. అత్యాధునిక పరికరాల ద్వారా చేసే ఈ ప రీక్షలు రైతులకు ఎంతో లాభసాటిగా మారుతున్నాయి.

కోవూరు నియోజకవర్గంలో..

మండలాలు	- కోవూరు, బుచ్చిరెడ్డిపాళెం, విడవలూరు, కొడవలూరు, ఇందుకూరుపేట
సాగు విస్తీర్ణం	- 65,400 ఎకరాలు
రైతులు సాగు చేస్తున్న పంటలు	- వరి, వేరుశనగ, ఇతర పంటలు
ఇప్పటివరకు కోవూరు అగ్రి ల్యాబ్‌లో జరిగిన పరీక్షలు	- 154



అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మురళీకృష్ణ(ఫైల్)

యాప్ ఎంతో ఉపయోగకరం

కోవూరులో ఏర్పాటైన డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లో విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల నాణ్యతను రైతులు పరీక్షించుకోవచ్చు. ఇది రైతులకు ఎంతో ఉపయోగకరం. ఈ ల్యాబ్ ఏర్పాటుతో నాసిరకం విత్తనాలు, ఎరువుల నుంచి రైతులకు ఉపశమనం కలుగుతోంది. ఈ ల్యాబ్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– సుజాత, ఏడీ, వ్యవసాయశాఖ

క్లుప్తంగా

విద్యార్థినులకు విజయదీపిక పుస్తకాల పంపిణీ



పొదలకూరు: పట్టణంలోని డీఎన్నార్ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 161 మంది విద్యార్థినులకు ప్రభుత్వం సరఫరా చేసిన విజయదీపిక పుస్తకాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం ఎం.పెర్సిస్ మాట్లాడుతూ విద్యార్థినులు విజయదీపిక పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీసీ చైర్మన్ టి.సురేఖ తదితరులు పాల్గొన్నారు.

వరిలో కంకినల్లి తెగులు



వరి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ రాజ్‌కుమార్

ముత్తుకూరు: మండలంలోని పలు గ్రామాల్లో వరి పంటకు కంకినల్లి తెగులు ఆశించినట్లు ఇందుకూరుపేట వ్యవసాయ సహాయ సంచాలకులు రాజ్‌కుమార్ తెలిపారు. మండలంలోని పంటపాళెం, దొరువులపాళెం పంచాయతీల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ–క్రాప్ జరిగిన వేరుశనగ, వరి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ వరి పైరు కంకుల్లో కొన్ని గింజలు నలుపుగా ఉండడం గుర్తించామని, కంకినల్లి తెగులు ఆశించడం వల్లనే గింజలు నలుపురంగుకు మారుతాయని తెలిపారు. దీని వల్ల గింజలు తాలుగా మారి, దిగుబడి తగ్గిపోతుందని పేర్కొన్నారు. పైరు చిరు పొట్ట దశలో పురుగు మందులు, తెగులు మందులు పిచికారీ చేసి పంటను సంరక్షించుకోవాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా ముత్యంగౌడ్



నడవడి ముత్యంగౌడ్

ముత్తుకూరు: వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా ముత్తుకూరుకు చెందిన నడవడి ముత్యంగౌడ్‌ను నియమిస్తూ వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం ఆదేశాలు జారీ చేసింది. పార్టీలో కొద్ది సంవత్సరాలుగా క్రియాశీలక పాత్ర పోషిస్తున్న ముత్యంగౌడ్‌ను ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక చేయడం పట్ల నియోజకవర్గ పార్టీ శ్రేణులు సంతోషం వెలిబుచ్చాయి. ఇందుకు సహకరించిన పార్టీ కన్వీనర్ మెట్ట విష్ణువర్ధనరెడ్డిని ముత్యంగౌడ్ సత్కరించారు.

శ్రీవారికి చక్రస్నానం



చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

బుచ్చిరెడ్డిపాళెం: స్థానిక రామకృష్ణానగర్‌లో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీవారికి చక్రస్నానం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. తొలుత స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకాలు, అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు అనంతరం చక్రస్నానం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి పుష్పయాగం, ధ్వజావరోహణ, సప్రావరణం, రుత్విక్కులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు వెంకటేశ్వర్లు – ఉమ, సురేష్‌బాబు – స్వప్న, పూర్ణచంద్రరావు – హరిణి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ పాలకమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

తుమ్మగుంటలో 'ఫ్యామిలీ డాక్టర్'



బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు): విడవలూరు మండలంలోని తుమ్మగుంట గ్రామంలో శుక్రవారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రామతీర్థం పీహెచ్‌సీ వైద్యుడు అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా తుమ్మగుంటలో ప్రత్యేక వైద్యశిబిరాన్ని నిర్వహించి గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా రోగుల ఇంటి వద్దకు వెళ్లి వైద్యపరీక్షలు చేసే అవకాశం కలిగిందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపాలి

బుచ్చిరెడ్డిపాళెం: దివ్యాంగ విద్యార్థులతోపాటు హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపాలని ఎంపీడీఓ నరసింహారావు కోరారు. స్థానిక డీఎల్ఎన్ఆర్ పాఠశాలలో శుక్రవారం వియాని హోమ్ ఛాయ్ ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థులకు, హెచ్‌ఐవీ బాధితులకు కరోనా కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులు, హెచ్‌ఐవీ బాధితుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. అలాగే స్వచ్ఛంద సంస్థలు కూడా వారి పట్ల ఆదరణ చూపాలన్నారు. ప్రేమాభిమానాలు చూపడం వల్ల వారిలో ఆత్మస్థైర్యం కలిగి త్వరగా కోలుకోవడంతోపాటు హెచ్‌ఐవీ బాధితులు మరికొంతకాలం బతికేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ దిలీప్, వైద్యుడు మనోజ్, భవిత కేంద్రం ఉపాధ్యాయులు శేషమ్మ, శ్రీనివాసులురెడ్డి, వియాని హోమ్ ఛాయ్ డైరెక్టర్ రమ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

ఇందుకూరుపేట: మండలంలోని ఇందుకూరుపేట సమీపంలో శుక్రవారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ బాలకృష్ణ తెలిపారు. ఈ వాహనాన్ని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

గ్రిగ్స్ క్రీడా పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు



గ్రిగ్స్ క్రీడల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం ప్రసూన

మనుబోలు: 2022–23 సంవత్సరానికి గాను సర్వేపల్లి నియోజవర్గస్థాయి గ్రిగ్స్ మెమోరియల్ టోర్నమెంట్‌లో మండలంలోని బద్దెవోలు వెంకన్నపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. మొత్తం 4 విభాగాల్లో 10 పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి ఓవరాల్ చాంపియన్స్‌గా నిలిచారు. పొదలకూరు మండలం మహమ్మదాపురం జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో ఈ నెల 21, 22, 23 తేదీల్లో జరిగిన గ్రిగ్స్ క్రీడా పోటీల్లో సీనియర్, జూనియర్ విభాగాల్లో బీపీ పాళెం హైస్కూల్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. సీనియర్ బాలికల విభాగంలో బాల్ బ్యాడ్మింటన్, హ్యాండ్‌బాల్, షటిల్, సాఫ్ట్‌బాల్, బ్యాస్కెట్ బాల్ క్రీడల్లో, జూనియర్ బాలికల విభాగంలో బాల్‌బ్యాడ్మింటన్‌లో ప్రథమ స్థానంలో నిలిచారు. అలాగే సీనియర్ బాలుర విభాగంలో బాల్‌బ్యాడ్మింటన్, హ్యాండ్‌బాల్, జూనియర్ బాలుర విభాగంలో బాల్‌బ్యాడ్మింటన్, టెన్నికాయిట్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచారు. చాంపియన్‌షిప్ సాధించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను శుక్రవారం పాఠశాల హెచ్‌ఎం మురళీమోహన్, పీడీ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థుల ప్రతిభ

పొదలకూరు: గ్రిగ్స్ మెమోరియల్ సర్వేపల్లి జోన్ క్రీడా పోటీల్లో మండలంలోని తోడేరు కాకాణి శేషమ్మ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ పోటీలు మహ్మదాపురంలోని డీఎస్సార్ జెడ్పీ హైస్కూల్లో ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించారు. బాడ్మింటన్ సీనియర్ బాలుర విభాగంలో తోడేరు విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు. జూనియర్ బాలికల విభాగంలో 8వ తరగతి చదువుతున్న జి.విజయలక్ష్మి వ్యక్తిగత చాంపియన్‌షిప్ సాధించింది. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో హెచ్‌ఎం ప్రసూన క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంట నమోదుకు 28న ఆఖరు

కొడవలూరు: పంట నమోదుకు ఈ నెల 28వ తేదీన ఆఖరు అని ఏఓ సీహెచ్ఎస్ లక్ష్మి తెలిపారు. మండలంలోని తాటాకులదిన్నె, గండవరంలలో శుక్రవారం ఆమె పర్యటించి పంట నమోదు సూపర్ చెక్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంట నమోదుకు గడువు పొడిగించినందున రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఇప్పటికే పంట నమోదు చేసుకొన్న రైతులు ఆర్బీకేలకు వెళ్లి ఈ–కేవైసీ చేసుకోవాలని సూచించారు. పంట నమోదు చేసుకోవడంతోపాటు ఈ–కేవైసీ కూడా పూర్తయిన రైతుల ధాన్యాన్నే కొనుగోలు కేంద్రాల్లో సేకరిస్తారని తెలిపారు. మండలంలో మరో 35 శాతం మంది రైతులు పంట నమోదు చేసుకోవాల్సి ఉన్నందున వారంతా ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఆమె వెంట ఏఈఓ ఎ.అనూష, వీఏఏలు ప్రసాద్, నవీన్, కవిత, శ్రావ్య ఉన్నారు.

రేపు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో సమీక్ష

కోవూరు: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నియమించిన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో శనివారం మండలంలోని పడుగుపాడులో ఉన్న రుక్మిణి కల్యాణ మండపంలో మధ్యాహ్నం 3 గంటలకు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు శుక్రవారం డీఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని అన్ని సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల నాయకులు, సోషల్ మీడియా కన్వీనర్లు, కోకన్వీనర్లు తప్పనిసరిగా కావాలని తెలిపారు.

నేడు మండల సమావేశం

కొడవలూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ గాలి జ్యోతి అధ్యక్షతన శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని తెలిపారు. మండలంలోని జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, అన్ని శాఖల అధికారులు విధిగా హాజరుకావాలని తెలిపారు. సమావేశంలో మండలంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించనున్నట్లు తెలిపారు.

ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా విజయకుమార్

కోవూరు: ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా డీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్ ఏకగ్రీవంగా ఎన్నిక కావడం అభినందనీయమని ఆ సంస్థ పీడీ డాక్టర్ సోమయ్య తెలిపారు. చైర్మన్‌గా ఎన్నికైన విజయకుమార్ శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ తనను చైర్మన్‌గా ఎన్నిక చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గతంలో డీఎల్‌డీఏ చైర్మన్‌గా రైతుల అభివృద్ధి కోసం పనిచేసినట్లుగానే ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

స్వరాజ్‌కు అభినందన



లక్కు స్వరాజ్

పొదలకూరు: వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా లక్కు స్వరాజ్‌ను నియమించారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు క్రిస్టియన్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా స్వరాజ్‌ను సర్వేపల్లి నియోజకవర్గం నుంచి ఎంపిక చేశారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి స్వగ్రామం తోడేరు పంచాయతీ శాంతినగర్‌కు చెందిన స్వరాజ్ ఈ పదవికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం పలువురు స్వరాజ్‌ను అభినందించారు. తన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహించి పార్టీ ఉన్నతికి కృషి చేస్తానని స్వరాజ్ తెలిపారు.

ఎరువుల గోదాముల్లో తనిఖీలు



ఎరువుల గోదామును తనిఖీ చేస్తున్న మార్క్‌ఫెడ్ డీఎం పవన్‌కుమార్ తదితరులు

ముత్తుకూరు: మండలంలోని ఎరువుల గోదాములను శుక్రవారం మార్క్‌ఫెడ్ డీఎం పవన్‌కుమార్, హబ్ మేనేజర్ విద్యాధరి తదితరులు తనిఖీ చేశారు. పిడతాపోలూరు, బ్రహ్మదేవి, పొట్టెంపాడు, మల్లూరు, ముత్తుకూరు ఆర్‌బీకే పరిధిలోని గోదాములను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. గోదాముల్లో ఉన్న నిల్వలు, రికార్డుల్లో ఉన్న వివరాల మధ్య తేడాను పరిశీలించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి జోత్స్నారాణితో మాట్లాడారు. ఎన్ని రకాల ఎరువులు, ఏ మేరకు నిల్వ చేశారన్న అంశంపై చర్చించారు. మండలంలో జరిగిన వరి సాగు, రైతులు తీసుకువెళ్లిన ఎరువుల బస్తాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులు సక్రమంగా ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు.

బంగారు ఆభరణాల బహూకరణ



బంగారు వడ్డాణం అందజేస్తున్న దాతలు



బంగారు తలకం బొట్టును అందజేస్తున్న దాతలు

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారికి పలువురు దాతలు శుక్రవారం బంగారు ఆభరణాలను బహూకరించారు. ఆస్ట్రేలియాలో ఉంటున్న మిట్టపల్లి వినోద్‌రెడ్డి – మాధవి దంపతులు అమ్మవారికి 46.240 గ్రాముల బరువు కలిగిన బంగారు వడ్డాణం అందజేసినట్లు ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు తెలిపారు. అలాగే నెల్లూరుకు చెందిన ఇనుకుర్తి మురళీ – సుప్రియ దంపతులు అమ్మవారికి 8.690 గ్రాముల బంగారు తిలకం బొట్టును సమర్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలను నిర్వహించి దాతలను శేషవస్త్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఈఓ వెంకటసుబ్బయ్య, పాలకమండలి సభ్యులు తిరువాయిపాటి నందకుమార్, ముంగర శివకుమార్ పాల్గొన్నారు.

దక్షిణ కాలువకు నీటి విడుదలను పెంచాలి



7ఆర్ కాలువలో ప్రవహిస్తున్న సాగునీరు

పొదలకూరు: సోమశిల దక్షిణ కాలువ దాని ఉపకాలువల చివరి ఆయకట్టుకు సాగునీరు సక్రమంగా అందడం లేదని, వెంటనే అధికారులు పరిశీలించి కాలువకు సాగునీటి విడుదలను పెంచాలని ఆయకట్టు రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. దక్షిణ కాలువ దాని ఉపకాలువలైన 7ఆర్, 26ఎల్, 28 ఎల్ కాలువల ద్వారా మండలంలోని చెన్నారెడ్డిపల్లి, నావూరు, భోగసముద్రం తదితర గ్రామాల రైతుల సాగునీటి అవసరాలకు నీటిని విడుదల చేస్తున్నారు. అయితే వారం రోజులుగా రైతులకు అవసరమైన మేర నీరు అందకపోవడంతో వరిసాగు చేస్తున్న రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కాలువల మధ్యలో జమ్ము పేరుకుపోవడం, మధ్యలో రైతులు విద్యుత్ మోటార్ల ద్వారా కాలువ నీటిని వినియోగించుకోవడం వల్ల చివరన ఉన్న చెన్నారెడ్డిపల్లి, భోగసముద్రం, చేజర్ల మండలం రెడ్డివారికండ్రిక తదితర గ్రామాల్లోని పొలాలకు సాగునీరు అందడం లేదని రైతులు తెలిపారు. అధికారులు మరో 20 రోజులు సాగునీటిని సక్రమంగా అందిస్తే పైర్లు పండించుకుంటామని చెబుతున్నారు. ఇదే అంశాన్ని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లనున్నట్టు రైతులు తెలిపారు.

కృష్ణపట్నంలో క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

ముత్తుకూరు: అదానీ ఫౌండేషన్ – అపోలో ఫౌండేషన్ సంయుక్తంగా కృష్ణపట్నం గ్రామంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం, క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 80 మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. 9 మందిని క్యాన్సర్ స్క్రీనింగ్‌కి గుర్తించారు. ఈ సందర్భంగా అదానీ ఫౌండేషన్ ప్రతినిధి రాజేష్ రంజన్ మాట్లాడుతూ వీరి నుంచి సేకరించిన స్పెర్మ్ నమూనాలను నెల్లూరులోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి పరీక్షల నిమిత్తం పంపుతున్నట్లు తెలిపారు. అపోలో ఫౌండేషన్ ప్రతినిధి ఎం.గాయత్రి, అదానీ ఫౌండేషన్ ప్రతినిధి సుహర్షన్ తదితరులు రోగులను పరీక్షించి మందులు అందజేశారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



తొట్టెలో నిల్వ ఉన్న నీటిని పారబోస్తున్న ఆరోగ్య సిబ్బంది

పొదలకూరు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సూచించారు. మండలంలోని మహ్మదాపురం పీహెచ్‌సీ పరిధిలో పొదలకూరు నర్సారెడ్డికాలనీలో శుక్రవారం డ్రైడే సందర్భంగా వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విస్తరణాధికారి రవికుమార్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించి ఇంట్లో నీటి పాత్రలు, తొట్టెలను శుభ్రం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. దోమలు వృద్ధి చెందకుండా చెత్తాచెదారాన్ని తొలగించాలని, ప్రాణాంతకమైన డెంగీ, మలేరియా, చికున్‌గున్యా జ్వరాల బారిన పడకుండా దోమతెరలను వినియోగించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య సహాయకులు సాని శివప్రసాద్, ఎం.రాధాకుమారి, ఎంఎల్‌హెచ్‌పీ సుంజలి, సచివాలయ ఏఎన్ఎం కృష్ణమ్మ, ఆశా కార్యకర్తలు సీత, ఉష, లక్ష్మి పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు



కొడవలూరు: మాట్లాడుతున్న సీఐ రామారావు

కొడవలూరు: విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని బుచ్చి సీఐ జి.రామారావు హెచ్చరించారు. మత్తు పదార్థాల వినియోగంతో అనర్థాలపై శుక్రవారం మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎవరైనా ర్యాగింగ్‌కు గురైతే వెంటనే కళాశాలలో పోలీసుశాఖ ఏర్పాటు చేసిన ఫిర్యాదుల పెట్టె ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. విద్యార్థులు గంజాయి లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం డ్రగ్స్ వల్ల అనర్థాలపై భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ పెనుబల్లి బాబునాయుడు, ప్రిన్సిపల్ పి.కుమార్‌బాబు, ఎస్సై జి.సుబ్బారావు, అడ్వయిజర్ కృష్ణ పాల్గొన్నారు.

ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారం కావు



తోటపల్లిగూడూరు: కళాశాల ఉత్తమ విద్యార్థులను సన్మానిస్తున్న సీఐ, ఎస్సైలు

తోటపల్లిగూడూరు: ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారం కావని కృష్ణపట్నం పోర్ట్ సీఐ వేమారెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వేమారెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. తోటి విద్యార్థులను ర్యాగింగ్ చేసినా, ప్రోత్సాహించినా శిక్షార్హులేనని తెలిపారు. అనంతరం కళాశాలలో ఉత్తమ విద్యార్థులను సీఐ, ఎస్సై సన్మానించారు. ఎస్సై ఇంద్రసేనారెడ్డి, ప్రిన్సిపల్ ధనుంజయకుమార్, ఎన్ఎస్ఎస్ పీఓ చిరంజీవి, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

చెడు మార్గంతో ప్రాణాలకు ముప్పు

ఇందుకూరుపేట: మాదక ద్రవ్యాల వినియోగం వంటి చెడు మార్గాలతో ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోందని, వాటికి దూరంగా ఉండాలని సెబ్ సీఐ బాలకృష్ణ సూచించారు. మండలంలోని కొత్తూరు వశిష్ఠ జూనియల్ కళాశాలలో ఎస్సై సీహెచ్ వాసుతో కలిసి మాదక ద్రవ్యాల వినియోగం, ర్యాగింగ్, ఫోక్సో చట్టం, గుడ్ టచ్ అండ్ బ్యాడ్ టచ్ అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. యువత మాదక ద్రవ్యాల బారిన పడి తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వైవీ సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్‌లో నమోదు చేసుకోండి

కొడవలూరు: ఆయుష్మాన్ భారత్‌లో ప్రతి ఒక్కరూ విధిగా పేర్లు నమోదు చేసుకోవాలని ఈఓపీఆర్డీ వి.నాగరాజు సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయుష్మాన్ భారత్ ప్రత్యేక నమోదు కార్యక్రమం కొడవలూరులో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్‌లో పేరు నమోదు చేసుకొంటే దేశంలో ఎక్కడైనా ఉచిత చికిత్స తీసుకొనేందుకు అర్హులవుతారన్నారు. అంతేకాకుండా వైఎస్సార్ బీమా పథకం వలె సాధారణ, ప్రమాద మరణాలకు ప్రభుత్వం పరిహారం చెల్లిస్తుందని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు మినహా ప్రతి ఒక్కరూ ఇందులో నమోదుకు అర్హులేనని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జి.రాధాకృష్ణ, వెల్ఫేర్ అసిస్టెంట్ బాలకృష్ణ, ఏఎన్ఎం సుభాషిణి, వలంటీర్లు పాల్గొన్నారు.